# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

## - మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ





**భువనగిరి, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ)** :యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు నెలవారి జిల్లా కలెక్టర్ల సమీక్ష సమావేదానికి జిల్లాకు ఇంచార్జీలుగా నియమింపబడిన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణవేణి, రేష్మ బేగం, మౌనికలు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు చేరవేయాలని కోరారు. బిజెపి, బిఆర్ఎస్ అరాచకాలను తిప్పికొట్టాలని పద్మ అన్నారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మహిళా అభివృద్ధికి మహిళా బలోపేతానికి కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, గృహ అవసరాలు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మహిళా శక్తి పథకాలు ద్వారా మహిళలు క్యాంటీలను పెట్టడానికి ఆర్థిక సహాయం మహిళలకు పెట్రోల్ బంకులు ఓనర్లుగా, ఆర్టీసీ బస్సు ఓనర్లుగా ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు. అతివల ఆర్థిక స్వావలంబన ప్రజా ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇందిరా మహిళా శక్తి, తెలంగాణ ప్రగతి మహిళలను కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యమన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో మహిళా కమిటీలను పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచనల మేరకు అందరమూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రాబోయే రోజులలో మహిళలకు నామినేటెడ్ పదవులతో పాటు పిసిసి, డిసిసి కార్యవర్గాలలో మహిళలకు స్థానం కల్పిస్తున్నారని పద్మ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణవేణి మౌనిక, పావని, ఎడమ పుష్ప, బ్లాక్ అధ్యక్షులు మండల అధ్యక్షులు సుధారాణి, సంగీత, పి. రజిత, కల పద్మ, కవిత, ఏ. జ్యోతి, శశిరేఖ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు





**సైనిక్ పురి, ఏప్రిల్ 11,(తెలంగాణ దిశ)** :మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి ఉత్సవాలను శనివారం సైనిక్ పురి చౌరస్తాలో తిరుపతయ్య న్యాయ సేవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు కోరుకొండ అవినాష్, మల్లేష్ వంశరాజ్, యాట భాస్కర్, పెంచాల సురేందర్, చిత్తారి ముదిరాజ్, రాజేష్ వంశారాజు, ఎస్ఏ రహీం, కుమారస్వామిలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, హైదరాబాద్ నగర మొదటి మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, శ్రవణ్, వివిధ సంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు స్థానికుల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వారి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు కొడుతూ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని కొనియాడారు. అదేవిధంగా తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఆయన తన భార్య సావిత్రిబాయి పులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులుగా తీర్చిదిద్దారని వివరించారు. రానున్న రోజులో వారి ఆశ సాధనకు ప్రతి ఒక్కరి తమవంతుగా కృషి చేయాలని సూచించారు.

# సోషల్ యాప్ ద్వారా వల వేసి దోపిడీలు

## - దొంగల గ్యాంగ్ ను అరెస్ట్ చేసిన కీసర పోలీసుల






**కీసర, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ)** :మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీసులు సోషల్ మీడియా యాప్‌ల ద్వారా యువకులను వల వేసి దోపిడీలకు పాల్పడుతున్న దొంగల గ్యాంగ్‌ను పట్టుకున్నారు. మొత్తం 7 మంది నిందితులలో 6 మందిని అరెస్ట్ చేయగా, ఒకరు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం, రాంపల్లి గ్రామానికి చెందిన బొడ్డ సాంబ శివరావును ఈ నెల 6వ తేదీ సాయంత్రం శ్రీనివాస్ నగర్ కాలనీలో ఓ కారులో వచ్చిన వ్యక్తి దారి అడుగుతూ అత్యవసరమని చెప్పి వాహనంలోకి ఎక్కించాడు. అనంతరం ఘట్‌కేసర్ మీదుగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాచారం గ్రామానికి తీసుకెళ్లి, అక్కడ మరో నలుగురు చేరి బాధితుడిని బెదిరించి దాడి చేసి 16 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు గ్రైండ్ యాప్ ద్వారా బాధితులను టార్గెట్ చేస్తూ, పరిచయం పెంచుకుని వాహనాల్లో తీసుకెళ్లి అవుటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లోని నిర్జన ప్రదేశాల్లో బెదిరింపులకు గురిచేసి దోపిడీలకు పాల్పడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. అరెస్ట్ చేసిన నిందితులు వరంగల్‌కు చెందిన కుసుమ కార్తిక్, రామ్‌రాజా అలియాస్ కుషాల్, కందుల సాయితేజ, గండ్ల శ్రావణ్, మాచర్ల పవన్ కళ్యాణ్, చెన్నకేశవుల పవన్ కళ్యాణ్ కాగా, బబ్లు సింగ్ పరారీలో ఉన్నాడు.




నిందితుల వద్ద నుండి 15 గ్రాముల బంగారు గొలుసు, స్విఫ్ట్ డిజైర్ కారు, వెస్పా స్కూటీ, 6 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే గ్యాంగ్ అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన కీసర పోలీసులు, సీసీఎస్ మల్కాజిగిరి బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## - బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్

## - సాకేత్ నూతన కమిటీకి కాప్రా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మద్దతు





**కాప్రా, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్ పరిధిలోని సాకేత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్, పార్టీ నాయకులతో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ మాట్లాడుతూ కాలనీల అభివృద్ధిలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి చురుకుగా పనిచేయాలని కమిటీ సభ్యులను ప్రోత్సహించారు. సాకేత్ కాలనీలో పారిశుధ్యం, రోడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ నివాసులు, యువకులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

## - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ)**:కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్సల కోసం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. ఈ సందర్భంగా చింతల్‌కు చెందిన వేముల లక్ష్మమ్మకు రూ. 60 వేలు, గాయం సుస్మిత రెడ్డికి రూ. 60 వేలు, నాగరాజుకు రూ. 60 వేలు, కూకట్‌పల్లికు చెందిన గోంగుల రాజుకు రూ. 56,500/-, బాచుపల్లికు చెందిన కొర్ర సునీత రాణికి రూ. 47,500/- ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయుక్తమవుతోందని తెలిపారు. అనారోగ్యం బారిన పడిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైనిక్‌పురి చౌరస్తాలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు






సైనిక్‌పురి, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ) : సామాజిక సంస్కర్త, మహానేత మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా సైనిక్‌పురి చౌరస్తాలో శనివారం పలువురు కాంగ్రెస్ నేతలు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లా డుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు అపారమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జా రాఘవరెడ్డి, కొత్త అంజి రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల రాజన్న, పార్టీ నాయకులు అజీజ్, తాడూరి అనిల్ కుమార్, ముదిగొండ లింగస్వామి, భద్రగామ నరసింహ, జమ్మిగడ్డ శ్రీనివాస్, మామిడి శ్రీనివాస్, చిందం బాల నరసింహ, బాజీ భాష, ప్రభాకర్, ప్రభాస్, సాహెబ్ సలీం, సుబేదార్ సయ్యద్ రహమతుల్లా, కోళ్ల విజేందర్, జానీ, జివిఎన్ రావు, పిర వలి ఇబ్రహీం, సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, సత్యం, అల్లా బక్షి, విల్సన్, సునీత, భవాని, సంధ్య, మహాలక్ష్మి, మాధవి, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ)** :మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా సైనిక్ పురిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే ఈ దేశానికి అపారమైన సేవలు అందించారని అన్నారు.

విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక మార్పులు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. బాల్య వివాహాలు, కుల వివక్ష నిర్మూలనకు సమాజంలో సంస్కరణలు అవసరమని, అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మహిళల అభ్యున్నతి విద్య ద్వారానే సాధ్యమని, సావిత్రి బాయి పూలేకు విద్య నేర్పించి మహిళల కోసం పాఠశాలను ప్రారంభించడం పూలే చేసిన గొప్ప సేవగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

**కాప్రా, ఏప్రిల్ 11, (తెలంగాణ దిశ) :**
జాతి వివక్షను నిర్మూలించేందుకు, సమాన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం శ్రమించిన విద్యావేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తెలంగాణా తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు సైనిక్ పురిలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, కాప్రా మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, నాయకులు భిక్షపతి గౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.



# స్పైలుగా చిన్నారులు.. మారని పాకిస్తాన్ వైఖరి

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐతో కుట్రలు చేస్తూనే ఉంది. తాజాగా ఐఎస్ఐ కుట్రను మన భద్రతా బలగాలు గుర్తించాయి. అయితే ఇందులో అభం శుభం తెలియని 15 ఏళ్ల పిల్లలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పఠాన్‌కోట్‌లో 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. భద్రతా సిబ్బంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పంచాడు. ఈ ఘటన ఐఎస్ఐ ఆన్‌లైన్ గ్రూమింగ్ వ్యూహాన్ని బయటపెట్టింది. జమ్మూ సాంబార్ ప్రాంతం నుంచి పఠాన్‌కోట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఈ అబ్బాయి వివిధ చోట్ల తిరిగి ఫొటోలు, వీడియోలు సేకరించాడు.

# ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచొద్దు

**అమరావతి,తెలంగాణ దిశ :** ఉద్యోగం 60 ఏళ్లకు చాలు, అంతకుమించి వయసు వద్దని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొత్త వారిని నియమించుకోవడం ద్వారా విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం, ప్రస్తుత ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందని వారు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచింది. ఉద్యోగ విరమణ తరువాత వారికివ్వాల్సిన ఆర్థిక బకాయిల నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు వయసు పెంచిందని ఇప్పటికే ఉద్యోగులు భావిస్తున్నారు. విద్యుత్ కార్పొరేషన్లలోనూ ఇలానే అమలు చేసి ఆర్థిక భారం నుంచి తప్పించుకోవాలని చూస్తోంది. అందులో భాగంగానే వీరికి కూడా ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికోసం మంత్రివర్గ ఉపసంఘాన్నీ ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం ఇప్పటికే పలుమార్లు సమావేశమైంది. అయితే 62 ఏళ్ల ఉద్యోగ విరమణ తమకొద్దని విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు, రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థల ఉద్యోగులపై పనిభారం ఎక్కువగా ఉంటుంది. 24 గంటలు అందుబా టులో ఉండాలి. వీళ్ల పని ఎప్పుడూ ప్రమాదంతో కూడుకున్నది.

